విజిలెన్స్ విచారణ వేగవంతం బదిలీ యత్నాల్లో అధికారయంత్రాంగం!

- బల్దియాలో పలువురు ఏఈల తీరు చర్చనీయాంశం
- ఏళ్ల తరబడి ఇక్కడే తిష్ట వేసిన వైనం

కార్పొరేషన్, మే 29: కరీంనగర్ నగరపాలక సంస్థలో స్మార్ట్‌సిటీ, ఇతర నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై ఫిర్యాదులు రావడంతో ఇప్పటికే విజిలెన్స్ శాఖ విచారణ వేగవంతం చేయగా.. మరోవైపు పలువురు ఇంజినీరింగ్ అధికారులు ఇప్పుడు బదిలీల కోసం ప్రయత్నాలు చేస్తుండడం బల్దియాలో చర్చనీయాంశంగా మారింది. ఏళ్ల తరబడిగా నగరపాలక సంస్థలోనే తిష్ట వేసిన ఇంజినీరింగ్ అధికారులు ఇప్పుడు విచారణ మొదలుకాగా, ఇక్కడి నుంచి బదిలీ చేయించుకోవడానికి ప్రయత్నాలు చేస్తుండడం గమనార్హం. కొంత కాలంగా నగరపాలక సంస్థలోని పలువురు ఇంజినీరింగ్ అధికారులు ఆయా విభాగాల్లో తిష్ట వేయడంతో పాటు.. అంతర్గత బదిలీలు చేసినా మళ్లీ పాత స్థానంలోకి రావడానికి స్థానికంగా ప్రయత్నాలు చేసి మరి విధులను తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఇప్పుడు అదే అధికారులు ఏకంగా ఈ మున్సిపాలిటీ నుంచి మరో మున్సిపాలిటీకి వెళ్లేందుకు జోరుగానే ప్రయత్నాలు సాగిస్తున్నారు.

విచారణతో మొదలైన అలజడి

నగరపాలక సంస్థలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల తీరుపై రాష్ట్ర ప్రభుత్వానికి కొందరు ఫిర్యాదు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ కార్పొరేటర్ బండారి వేణు సైతం నగరంలో జరిగిన చౌరస్తాల సుందరీకరణ పనులపై ఫిర్యాదు చేశారు. అలాగే ఇప్పటికే హౌసింగ్ బోర్డు కాలనీలో జరిగిన అభివృద్ధి పనులపై కూడా విచారణ కొనసాగుతున్నది. పలువురు ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులను సైతం విజిలెన్స్ శాఖ విభాగం అధికారులు విచారణ చేశారు. దీంతో బల్దియా ఇంజినీరింగ్ శాఖలో అలజడి మొదలైంది. ఏయే పనుల్లో ఎవరిని బాధ్యులను చేస్తారోననే భయం ఇప్పుడు ఇంజినీరింగ్ శాఖలో కలకలం రేపుతున్నది. దీంతో ఇప్పటికే విచారణకు హాజరైన అధికారుల్లో ఇద్దరు ఏకంగా సెలవు పెట్టి వెళ్లినట్లు తెలుస్తున్నది. ముఖ్యంగా వీరు పూర్తిగా ఇక్కడి నుంచి బదిలీ చేయించుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. పలువురు ఏఈలు పూర్తిగా ఇక్కడి నుంచి మరో మున్సిపాలిటీకి మారేందుకు జోరుగానే ప్రయత్నాలు చేస్తున్నారని, ఇప్పటికే మంత్రులు, ప్రజాప్రతినిధులను కలిసి బదిలీల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. అయితే ముఖ్యంగా నగరంలో జరిగిన అభివృద్ధి పనుల్లో కీలకంగా వ్యవహరించి, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులే ఇక్కడి నుంచి బదిలీల కోసం యత్నాలు చేస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న బదిలీల్లో ఎవరు ఎక్కడికి మారుతారో.. విజిలెన్స్ విచారణలో ఎవరు బాధ్యులుగా తేలుతారో వేచి చూడాలి.

దృష్టి మరల్చేందుకే ట్యాపింగ్ డ్రామా

- పాలన, పథకాల అమలులో సర్కారు విఫలం
- కవ్వంపల్లి ఫోన్ ట్యాపింగ్ రాజకీయ సృష్టి
- మానకొండూర్‌లో కే ట్యాక్స్
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

మానకొండూర్, మే 29: హామీల అమలు, పాలనలో విఫలమైన ప్రభుత్వం ప్రజల దృష్టిని మరల్చేందుకే ఫోన్ ట్యాపింగ్ డ్రామా ఆడుతున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు మండిపడ్డారు. స్టేట్ ఇంటలిజెన్స్, ఐబీ స్పెషల్ బ్రాంచ్ పరిధిలో ఉండే ట్యాపింగ్‌తో గత బీఆర్ఎస్ సర్కారుకు ఎలాంటి సంబంధంలేదని తేల్చిచెప్పారు. ప్రజారంజక పాలన అందించిన కేసీఆర్‌పై బురదజల్లేందుకే సీఎం రేవంత్ ఈ నాటకానికి తెరలేపాడని దుయ్యబట్టారు. బుధవారం మానకొండూర్ గడిమహాల్‌లో విలేకరులతో మాట్లాడారు. సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ ఫోన్ కాల్ రికార్డులు, పొన్నం ప్రభాకర్, తహసీల్దార్, ఆర్డీవోతో మాట్లాడిన కాల్ రికార్డుల లీక్‌లపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్రజాదరణ కోల్పోయిందన్నారు. వడ్ల స్కాం, లిక్కర్ స్కాం, వడ్ల కొనుగోలులో జాప్యం, విత్తనాలు, ఎరువుల కొరత, ఆరు గ్యారెంటీల అమలును దారి మళ్లించడానికే సీఎం రేవంత్‌రెడ్డి ఆడుతున్న పెద్ద నాటకం ఫోన్ ట్యాపింగ్ అని మండిపడ్డారు. ఓటుకు నోటు కేసులో ఆయన జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. రాష్ట్రంలో ఆర్ ట్యాక్స్, యూ ట్యాక్స్ నడుస్తుంటే మానకొండూర్ నియోజకవర్గంలో కే ట్యాక్స్ నడుస్తున్నదన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి నియోజకవర్గానికి ఒక టూరిస్ట్ అని, ఆయన చేసిన అభివృద్ధి ఏమీలేదన్నారు. ఎమ్మెల్యే అండదండలతో అనుచరులు రియల్ ఎస్టేట్, గ్రానైట్, ఇసుక, కాంట్రాక్టర్ల దగ్గర కే ట్యాక్స్ పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాలుగేళ్లలో నాలుగు పార్టీలు మారిన కవ్వంపల్లి, రాజకీయ లబ్ధికోసమే తన ఫోన్ ట్యాప్ చేశారని రాద్ధాంతం చేస్తున్నాడని ఆక్షేపించారు. రాజకీయాలను పెట్టుబడులు, రియల్ ఎస్టేట్ అని భావించే వెలిచాల రాజేందర్‌రావుకు కేసీఆర్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. ఆయన మాటలు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, నాయకులు ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, రామంచ గోపాల్‌రెడ్డి, నెల్లి శంకర్, పిండి సందీప్ ఉన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

తిమ్మాపూర్, మే 29: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. మండల, డివిజన్ అధికారులు హాజరయ్యారు. సభ నడిపించేంత మంది సభ్యులు లేకపోవడంతో సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ కేతిరెడ్డి వనితా దేవేందర్‌రెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేత కుటుంబానికి వినోద్‌కుమార్ పరామర్శ

నరేందర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కార్పొరేషన్, మే 29: కరీంనగర్‌లోని కాపువాడకు చెందిన ఆరె కటిక సంఘం జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు మిర్యాల్‌కర్ నరేందర్ కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ బుధవారం పరామర్శించారు. నరేందర్ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ అన్ని విధాలుగా కుటుంబాన్ని ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఆయన నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

వినోద్‌కుమార్‌ను కలిసిన ప్రవీణ్‌కుమార్

కార్పొరేషన్, మే 29: కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో బుధవారం బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌ను బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కరీంనగర్‌కు వచ్చిన ఆయన వినోద్‌కుమార్‌ను కలుసుకొని మాట్లాడారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

కార్యకర్త రాంరెడ్డి భార్యకు బీమా చెక్ అందిస్తున్న హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్

సైదాపూర్, మే29: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ భరోసా ఇచ్చారు. మండలంలోని వెన్నంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పిన్‌రెడ్డి రాంరెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందగా, బుధవారం ఆయన భార్య పద్మకు పార్టీ సభ్యత్వ ప్రమాదబీమా ద్వారా మంజూరైన 2లక్షల రూపాయల చెక్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీకి కార్యకర్తలే పునాది అన్నారు. పార్టీ పటిష్టానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, వెన్నంపల్లి సింగిల్‌విండో చైర్మన్ బిల్ల వెంకటరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కాయిత రాములు తదితరులు ఉన్నారు.

ఆస్తి పన్ను సక్రమంగా మదింపు చేయాలి

కార్పొరేషన్, మే 29: నగరంలోని భవనాల ఆస్తి పన్నులను నిబంధనలు మేరకు మదింపు చేయాలని అదనపు కలెక్టర్ పవుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని భాగ్యనగర్, జ్యోతినగర్ ప్రాంతంలో అండర్ అసెస్డ్ భవనాలుగా గుర్తించిన వాటిలో అదనపు నిర్మాణాలు, పునర్ నిర్మాణ భవనాలు, వినియోగ మార్పిడి భవనాలకు ఆస్తి పన్ను రివైజ్డ్ చేయడాన్ని పరిశీలించారు. తక్కువ ఆస్తి పన్ను గల భవనాలకు ఆస్తి పన్నును మున్సిపల్ చట్ట ప్రకారం సరి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, రెవెన్యూ అధికారి ఆంజనేయులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రషీద్, ఖలీల్ పాల్గొన్నారు.

రైతులందరికీ విత్తనాలు అందేలా చూస్తాం

కరీంనగర్ రూరల్, మే 29: మండలంలోని రైతులందరికి జీలుగ విత్తనాలు అందేలా కృషి చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి బీ సత్యం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, మండలానికి దాదాపు 350 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అవసరం ఉండగా, సోమవారం కరీంనగర్ డీసీఎంఎస్‌కు 80 క్వింటాళ్లు, బుధవారం తీగలగుట్టపల్లి డీసీఎంఎస్‌కు 40 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని వెల్లడించారు. మరో 100 క్వింటాళ్లు గురువారం కరీంనగర్ డీసీఎంఎస్‌కు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. వచ్చిన స్టాక్‌ను వచ్చినట్లు రైతులకు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 29: నగరంలో ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 8నుంచి 10గంటల వరకు సాయికృష్ణ టాకీస్ ఏరియా, ముకరంపుర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. అలాగే నగరంలో కొత్త డీటీఆర్, లైన్ పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 9నుంచి 11గంటల వరకు కెమిస్ట్రీ భవన్ ఏరియా, మాజీ ఎమ్మెల్యే కటారి దేవేందర్ రావు ఇంటి ఏరియా, సాధన స్కూల్ ప్రాంతం, శ్రీ వేంకటేశ్వర గుడి ఏరియా, జ్యోతినగర్ లో కొంత ప్రాంతానికి విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వినియోగదారుల హక్కులపై విస్తృత ప్రచారం అవసరం

కలెక్టరేట్, మే 29 : క్రయ, విక్రయాలపై నమ్మకం సడలిన నేటి రోజుల్లో వినియోగదారుల హక్కులపై స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు, వినియోగదారుల సంఘాలు విస్తృత ప్రచారం చేపట్టాల్సిన అవసరముందని జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారి సురేశ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా వినియోగదారుల సంఘం నూతన కార్యవర్గం ఇటీవల ఎన్నిక కాగా, బుధవారం డీఎస్‌వోను సంఘ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి నూతన కమిటీ ప్రతినిధులు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారిని ద్దేశించి మాట్లాడుతూ, వస్తు కొనుగోళ్లలో వినియోగదారులకు మోసం జరిగితే, ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేసేలా సంఘాలు ప్రోత్సహించాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పకిడి జీవన్ మాట్లాడుతూ, మార్కెట్‌లో జరుగుతున్న మోసాలపై వినియోగదారులకు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఎగుర్ల రమేశ్, ప్రధాన కార్యదర్శి శివరాత్రి మోహన్, సహాయ కార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి జింక లావణ్య, ప్రతినిధులు అల్సా నరేశ్, పడటింటి సత్తయ్య పాల్గొన్నారు.

డీసీఎంఎస్ కాంప్లెక్స్ వ్యవహారంపై నివేదిక ఇవ్వండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు
- రేపోమాపో ప్రత్యేక బృందం విచారణ

గతంలో విచారణను తప్పదోవ పట్టించిన వైనం

హుజూరాబాద్, మే 29: హుజూరాబాద్ డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో షెట్టర్ల లీజు వ్యవహారంలో అధికారులు, పాలకవర్గం ఒంటెద్దు పోకడలపై ఈనెల 24న 'అంతా మా ఇష్టం' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్ పమేలా సత్పతి పూర్తి స్థాయి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని డీసీవో రామానుజాచార్యులను ఆదేశించినట్లు తెలిసింది. డీసీఎంఎస్ కాంప్లెక్స్ నిర్మాణ సమయంలో బహిరంగ వేలం వేసి షెట్టర్లను లీజుకు ఇచ్చినప్పుడు ఉన్న నిబంధనలు ఏమిటి?, ఇప్పుడు వాటిని అతిక్రమించి ఇబ్బడిముడిగా కిరాయిలు ఎందుకు పెంచినట్టు... ముఖ్యంగా ఒకే బ్లాకులో ఒకేరకం కొలతలు ఉన్న షెట్టర్ల అద్దె విషయంలో భారీగా తేడాలేందుకున్నాయి...ఈ విషయంలో డీసీఎంఎస్ అధికారుల అత్యుత్సాహం చూపించడంలో అంతర్యమేమిటి? ఈ అంశాలపై విచారణ చేయాలని కలెక్టర్ డీసీవోకు జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు. పాత లీజుదారులను కాదని కొత్త వారికి ఎందుకు అగ్రిమెంట్ చేశారు. వీళ్లను అడ్డుపెట్టుకొని ఏమైనా అక్రమాలకు పాల్పడ్డారా...తిరిగి పాత వాళ్లకు ఎందుకు చేసినట్లు అనే అంశాలపై క్షుణ్ణంగా విచారణ చేసి పూర్తివివరాలను వారం రోజుల్లో సమర్పించాలని ఆదేశించినట్లు తెలిసింది. దీనికి డీసీవో ముగ్గురి అధికారులతో కూడిన ఓ బృందాన్ని విచారణ చేసేందుకు సిద్ధం చేయగా...రేపోమాపో వారు విచారణ మొదలు పెట్టనున్నట్లు సమాచారం.

'నమస్తే ఎఫెక్ట్'

'చెరువు శిఖం మాయం'పై కదిలిన యంత్రాంగం

- కలెక్టర్ ఆదేశాల మేరకు పలు శాఖలకు చెందిన అధికారుల జాయింట్ ఇన్స్‌పెక్షన్
- శిఖం కబ్జా నిజమేనని నిర్ధారించిన అధికారుల బృందం
- కబ్జాకు పాల్పడినట్టు భావిస్తున్న వ్యక్తి వద్ద అసైన్డ్ పట్టా
- నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని వెల్లడి.. భూమిలో అడుగు పెట్టద్దని ఆదేశాలు

గొడుగు కుంట కబ్జాపై తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

జమ్మికుంట, మే 29: మున్సిపల్ పరిధిలోని ధర్మారం సమీపంలోని రూ.కోట్ల విలువజేసే గొడుగు కుంట శిఖం భూమి కబ్జాపై 2వ వార్డు కౌన్సిలర్ బొంగోని ఫిర్యాదు నేపథ్యంలో ఈ నెల 27న 'చెరువు శిఖం మాయం' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ నుంచి స్పందన వచ్చింది. చెరువు శిఖం కబ్జాపై నివేదికను అందించాలని రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖలను కలెక్టర్ ఆదేశించారు. దీంతో బుధవారం తహసీల్దార్ విజయ, సర్వేయర్ మనోజ్, మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, ఇరిగేషన్ ఏఈ నవీన్, తదితరులు కదిలారు. గొడుగు కుంట శిఖం, కబ్జాకు గురైనదిగా భావిస్తున్న స్థలాన్ని జాయింట్ ఇన్స్‌పెక్షన్ చేశారు. శిఖం కబ్జా నిజమేనని నిర్ధారణకు వచ్చారు. ఇదే సమయంలో కబ్జాకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి వద్ద కూడా శిఖం భూమికి సంబంధించిన అసైన్డ్ భూమి పత్రాలున్నాయి. 2005లో రెవెన్యూ నుంచి పట్టా పొందినట్లు ఉంది. శిఖం భూమిపై అసైన్డ్ పట్టా ఎవరిచ్చారు..? ఎందుకిచ్చారు..? నిజమైన పట్టానా..? ఫేక్‌దా..? తదితర అంశాలపై పట్టా పొందానని చెబుతున్న వ్యక్తిని ప్రశ్నించిన అధికారులు, ప్రతి అంశాన్ని రికార్డు చేశారు. శిఖం పట్టాను పరిశీలించేందుకు అధికారుల బృందం నివేదికను తయారు చేశారు. సదరు నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. శిఖం భూమి దాదాపు 20గుంటల వరకు కబ్జా జరిగినట్లు తేల్చినట్లు సమాచారం. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. శిఖం కబ్జా, పట్టా అంశాలను రికార్డులో పరిశీలిస్తామని చెప్పారు. విచారణ పూర్తయ్యేంత వరకు శిఖంలో అడుగు పెట్టకూడదని కబ్జాకు పాల్పడ్డాడని భావిస్తున్న వ్యక్తికి చెప్పామని తెలిపారు. కాగా, శిఖం కబ్జాపై కౌన్సిలర్ వీరన్న, తదితరులు మాట్లాడుతూ.. శిఖం పట్టా ఎవరూ ఇవ్వలేదని, రికార్డులు చూస్తే బహిర్గతం అవుతుందని చెబుతున్నారు. కోట్లు విలువజేసే శిఖం భూమిని కాపాడుకుంటామని తేల్చిచెప్పారు.

సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే

శంకరపట్నం, మే 29: మండలంలోని కన్నాపూర్-ధర్మారం గ్రామాల సరిహద్దు ఆలయం వాలీ, సుగ్రీవ, రామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. అర్చకులు ఆయన ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యేను శేష వస్త్రంతో ఘనంగా సన్మానించారు. అనంతరం ముత్తారం శ్రీసీతారామచంద్రస్వామిని, అదే గ్రామంలో రేణుకా ఎల్లమ్మను ఎమ్మెల్యే దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు బసవయ్య, తిరుపతిగౌడ్, సదానందం, కాటం పాపిరెడ్డి, మహేశ్‌గౌడ్, చింతిరెడ్డి పద్మ, గౌడ కుల సంఘం నాయకులు, గీత కార్మికులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఒలింపిక్ సంఘం ఎన్నికల బరిలో గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి

- సంయుక్త కార్యదర్శి పదవికి నామినేషన్ దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి

కొత్తపల్లి, మే 29 : తెలంగాణ ఒలింపిక్ సంఘం నూతన కార్యవర్గానికి ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 25న విడుదలైంది. నామినేషన్ల ప్రక్రియ బుధవారంతో ముగియగా ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి పదవికి నామినేషన్ దాఖలు వేశారు. ఈ మేరకు ఆయన బుధవారం హైదరాబాద్‌లోని ఒలింపిక్ భవన్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మాజీ జడ్జి సీ ప్రవీణ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలను అందించారు. గతంలో తెలంగాణ ఒలింపిక్ సంఘం కార్యవర్గ సభ్యులుగా విజయవంతంగా పనిచేసిన జనార్దన్‌రెడ్డి నేడు సంయుక్త కార్యదర్శి పదవికి నామినేషన్ దాఖలు చేయడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాలో క్రీడారంగ అభివృద్ధే ధ్యేయంగా పనిచేసేందుకు తనవంతుగా కృషి చేయనున్నట్లు తెలిపారు. జూన్ 9న జరుగనున్న తెలంగాణ ఒలింపిక్ సంఘం ఎన్నికల్లో సంయుక్త కార్యదర్శిగా గెలుస్తానని ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట పెద్దపల్లి జిల్లా జూడో సంఘం ప్రధాన కార్యదర్శి సిలివేరి మహేందర్‌తో పాటు పలువురు నామినేషన్ దాఖలులో పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అత్యుత్తమ సేవలందించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్ రూరల్, మే 29 : చిన్నారులు, గర్భిణుల సంపూర్ణ ఆరోగ్యం కోసం అంగన్‌వాడీల ద్వారా అత్యుత్తమ సేవలందించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో బుధవారం జిల్లాలోని సీడీపీవోలు, ఏసీడీపీలు, సూపర్‌వైజర్లు, ఎంపిక చేసిన అంగన్‌వాడీ టీచర్లు, పోషణ అభియాన్ సిబ్బందికి ప్రీస్కూల్‌పై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు, చిన్నారులకు ఆటపాటలతో పాటు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. సీడీపీవోలు, ఏసీడీపీవోలు, సూపర్‌వైజర్లు మౌలిక వసతుల కల్పనపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తరచూ కేంద్రాలను తనిఖీ చేస్తూ ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సీడీపీవోలు సవిత, తిరుమల, సౌందర్య, లక్ష్మణ్, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా మేనేజర్ పీ జయశ్రీ, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ నాగరాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పాఠశాలల్లో పనులన్నీ పూర్తి కావాలి

కమాన్‌చౌరస్తా, మే 29 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులన్నీ జూన్ 4వ తేదీలోగా పూర్తిచేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం జరిగితే ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిపై స్పెషల్ ఆఫీసర్లు, ఇంజినీరింగ్ అధికారులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పనులపై నిర్లక్ష్యం వద్దని, రాత్రింబవళ్లు పనులు చేయించాలని సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో సైతం మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ మాట్లాడుతూ, స్పెషల్ ఆఫీసర్లు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీవో శ్రీధర్, డీఈవో జనార్దన్ రావు, జడ్పీ సీఈవో శ్రీనివాస్, పీఆర్ ఈఈ శ్రీనివాస్ రావు, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

స్వధార్ హోమ్‌ను సందర్శించిన న్యాయమూర్తులు

కలెక్టరేట్, మే 29 : జిల్లాలోని వివిధ కోర్టుల్లో జడ్జిలుగా ఎంపికై, శిక్షణ పొందుతున్న న్యాయమూర్తులు బుధవారం జిల్లా కేంద్రంలోని స్వధార్ హోమ్, ప్రభుత్వ వృద్ధాశ్రమాలను సందర్శించారు. వృద్ధాశ్రమంలో అందుతున్న సేవలపై నిర్వాహకులు వివరిస్తుండగా ఆసక్తిగా విన్నారు. అలాగే స్వధార్ హోమ్‌లో ఉన్న బాధితులతో మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థలో రెండు రోజుల శిక్షణలో భాగంగా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ ఆధ్వర్యంలో తొమ్మిది మంది శిక్షణ న్యాయమూర్తులు కార్యక్రమంలో పాల్గొనగా, వారి వెంట జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, వృద్ధాశ్రమ, స్వధార్ హోం సిబ్బంది ఉన్నారు.

అంబాల్‌పూర్ పాఠశాలను సందర్శించిన ఏసీ

శంకరపట్నం, మే 29: అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపికైన అంబాల్‌పూర్ ప్రాథమిక పాఠశాలను బుధవారం అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించారు. పాఠశాలలు పునర్ ప్రారంభమయ్యేలోగా మరమ్మతు పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఇక్కడ డీఈవో జనార్దన్‌రావు, ఏపీడీవో శ్రీవాణి, పీఆర్ డీఈఈ వెంకటేశం, ఎంపీవో బషీరుద్దీన్, ఏఈఈ తిరుపతి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సుభాష్, స్కూల్ హెచ్ఎం పద్మ, సీఆర్పీలు కొమురయ్య, మంగ, వీవో అనిత తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

చిగురుమామిడి, మే 29: రేకొండలో జున్నూరి శ్రీనివాస్ అనే ఆటో డ్రైవర్ ఇటీవల అనారోగ్యంతో మృత